# పెట్టుడు పేరు

శ్రీమతి నిడమర్తి నరసమాంబ

మా యుపాధ్యాయుఁడుగారు చాల ముసలివారు. ముసలివారికి సహజములైన కోపము, చిరాకు, ఆయనకు హెచ్చు. బడిలో నేదియో యొక మిషపెట్టి చీటికి, మాటికి బడిపిల్లలఁ దిట్టుచు, కొట్టుచు, మధ్య మధ్య కునుకుచు కాలము వెళ్ళఁబుచ్చుచుండెను. ఒక్కొక్కప్పుడు ఏ కుఱ్ఱవానికో పాఠముఁ జదువుమని చెప్పి కుర్చీలో చిన్న నిద్రఁ దీయుచుండును. బాలుర యల్లరివల్ల నాతనికి మెలకువ వచ్చినతోడనె చీకాకుపడుచు నందరిని వరుసపెట్టి చావఁ గొట్టుచుండును. పాఠములు చదువకున్న నతఁడేమియు ననువాఁడుకాడు కాని యల్లరిచేసినమాత్ర మాతఁడుగ్రుఁడగును. ఎట్టి బెత్తమైన నాతని చేతులలో నొక నెలదినములలోపున నాశన మగును. పిల్లలందఱికి నతనియెడల నమితమైన భయము.

దీనికితోడు మా తరగతిలో ముగ్గురు బాలికలు చదువుచుండిరి. వారిని వెక్కిరించియు, వారిపై కాగితపు బంతులఁ విసరియు, సిరాను జల్లియు, పుస్తకముల నపహరించియు వారినేడ్పించి బాలురు వినోదించుట మాన కుండిరి. ఉపాధ్యాయుని బెత్తమునకు పని కలుగుచునే యుండెను.

బడిలో నందరికన్న నే నమాయకుఁడనగుటచే వీలగునపుడెల్ల గడుసరి బాలురు వారి యపరాధముల నాపై మోపి చల్లగ తప్పించుకొనుచుండిరి. ఉపాధ్యాయుఁడుగారు నన్ను 'మెత్తనిదొంగ' యని శిక్షించుచుండెడివారు. నేనేమియుఁ జేయలేకుండుటచే నుపాధ్యాయు నీలోకమునుండి శీఘ్రముగఁ దీసికొనిపొమ్మని దేవుని ప్రార్థించుచుండెడివాఁడను.

మా తరగతి బాలికలలో 'మీనాక్షి' యొకతె. ఆమె మాయూరి మేజస్ట్రేటుగారి కుమార్తె. నల్లగ, మిక్కిలి పొడవుగ నుండును. మెడ పొడవుగను, వికృతముగను యుండును. దైవమీయని యందముఁ దెచ్చి పెట్టుకొనుటకై యామె చేయని ప్రయత్నముండదు. ఆమెను తఱచుబాలురు గేలిచేయుచుందురు.

ఒకనాడుదయమున బడివేళకుఁ గొంచెము ముందుగ మా తరగతిహాలులో బాలులందరు సమావేశమై, కేకలతోడను, నవ్వులతోడను, పరిహాసములతోడను, పాటలతోడను గదిగోడలను ప్రతిధ్వనింపఁజేయుచుండిరి. గంట మ్రోగినతోడనె యంతయు నిశ్శబ్దమాయెను 'టిక్', 'టక్' మని జోడుల శబ్దమాయెను. ఎవరి స్థానములకు వారు పోయి, యుపాధ్యాయునికై ఎదురుఁజూచుచుండిరి. దొరసాని జోడుఁ దొడగికొని యతి యొయ్యారముగ నడుచుచు, మీనాక్షి లోపలకు వచ్చుచుండెను. అందరి దృష్టు లామెపైఁబడెను. ఆమె పెద్ద పెద్ద నీలిపువ్వులుఁ గల తెల్లని సిల్కుచీరఁ గట్టినది. కండ్లకు సులోచనముల దగల్చినది. ఒక కొంటె కుఱ్ఱవాఁడు 'సినీమాతార' యనెను. అందరు నవ్విరి; యింకొకఁడు 'అప్సరస' యనెను; మరల నవ్విరి. కాని తెలివిఁ గల బాలుఁడొకడు 'జిరాఫీ' యనినతోడనే హాస్యములతోడను, కరతాళధ్వనులతోడను, గదియంతయు గగ్గోలయ్యెను. అందరాతనియుక్తికి మెచ్చుకొనిరి. ఇంతలో నుపాధ్యాయుని రాకచే నంతయుఁ జల్లారెను.

నాటినుండియు మీనాక్షికి "జిరాఫీ" యొగతాళిపేరాయెను. కొన్నాళ్లకు మీనాక్షికి "జిరాఫీ" యను నామము పరిపాటాయెను. ఆమె యసలుపేరు నందఱు మరువఁజొచ్చిరి. "జిరాఫీ" యనినఁగాని చాలమంది యామెను గుర్తింపఁజాలకుండిరి. మీనాక్షికిది దుర్భరముగనుండెను. ఒకనాడామె తండ్రితోఁ

నిది యెల్లఁజెప్పియేడ్చెను. మరునాడు మేజస్ట్రేటుగారు బడికివచ్చి ప్రధానోపాధ్యాయునితో నిదియెల్లఁజెప్పి “ఇట్టి దురాచారమును మాన్పింపలేకున్న నీవీపదవికెట్లు తగుదువు? నీకండ్లయెదుట బాలురిట్టిదుండగములు చేయుచుండ నీవెట్లూరకుంటివి” అని నిష్ఠురములాడిపోయెను.

ప్రధానోపాధ్యాయుఁడు వెంటనే యుపాధ్యాయులనందరిని బిలపించి, వారికీసంగతులఁదెల్పి ఈ విషయమై తగిన శ్రద్ధతీసికొనుఁడని మందలించెను. అటుతరువాత ‘ఏ తరగతివిద్యార్థి యామె నవమానపరచినను, యాతరగతి యుపాధ్యాయునిపై గట్టిచర్య తీసికొనఁబడును’ అని బెదరించెను.

మా యుపాధ్యాయుఁడు తిరిగివచ్చి, మాకొక పెద్ద యుపన్యాసమిచ్చిరి. ‘ఇకముందు ఎవరినోటినుండి నైననుసరియే, ‘జిరాఫీ’యను శబ్దమువచ్చినయెడల వానిని హతమార్తును. ‘జిరాఫీ’యేమిటి? మీతలకాయ ‘మీనాక్షి’యనుటకు నోరునొప్పియా? ఇదిగో నందరువినుడు. ఆఖరుసారి తెలియఁజేయుచున్నాను. ఇటుపైన నెవఁడైనను, “మీనాక్షి”యనకుండ “జిరాఫీ”యన్నాడా, చచ్చినాడన్నమాటే! వీపులొక్కవొల్చివేయుదును. హుఁ! జాగ్రత!’ అని హుంకరించెను.

మధ్యాహ్నము జాగ్రఫీపాఠము కొంచెముచెప్పి, ఉపాధ్యాయుడు విసుగుగనుండుటచే నన్ను నిలువఁబడి పాఠము గట్టిగఁజదువుమనిఁజెప్పి పుస్తకమును క్రిందఁబారవైచి, కాళ్లు మేజాపైఁజాచుకొని కుర్చీలోఁ జారఁబడెను. నా దురదృష్టమును నిందించుకొనుచు నేను పాఠముఁజదువ నారంభించితిని. ఉపాధ్యాయుఁడుగారు చిన్నకునుకుఁదీయుచుండిరి. నేఁజదువుచు, ‘ఇచ్చట జిరాఫీయను పొడుగుమెడఁగల వింత మృగము గాననగును.’ అనువాక్యము కడకువచ్చితిని. నా కుపాధ్యాయుని హెచ్చరిక తటాలున జ్ఞాపకమువచ్చెను. కొంత జంకుపుట్టినది. బాలురందరు నావైపుఁ జూడసాగిరి. నేను కొంచమాలోచించి, యుపాధ్యాయుని హెచ్చరిక ననుసరించి, ‘ఇచ్చట ‘మీనాక్షి’ యను పొడుగుమెడఁగల వింత మృగము..............’ అని వాక్యము పూర్తిగ చదువకమునుపె, త్రుళ్లిపడి యుపాధ్యాయుఁడు లేచి బెత్తమందుకొని సింహమువలె గర్జించుచు నాపైకురికిరి. మరుక్షణము నాపై దెబ్బలవర్షము కురియుచుండెను. నే నేడ్చుచు ‘అయ్యా! నేచేసిన తప్పేమి? మీయాజ్ఞానుసారమే చేసితిని.’ అంటిని. ‘పొగరుబోతా! నాతో నీకుహాస్యములటరా’ యనియాయాసముతో వగర్చుచు మఱింత గట్టిగఁగొట్టెను.

ఆరాత్రి మఱింత భక్తితో దేవునిప్రార్థించితిని.

## భాగవతసేవ

సీ. సంసార గంభీర సాగరంబుఁ దరింప ఘనమైన నావ భాగవతసేవ
బహుజన్మ సంచిత పంకంబు సడలింప గంగాభి భావ భాగవతసేవ
అజ్ఞానతా మిస్రమడగింపఁగా జ్ఞాన నవదీప భావ భాగవతసేవ
నిరయభీతినిఁబాపి హరిపదంబును జేర్పఁ గలరాచ త్రోవ భాగవతసేవ
గీ. సతతసజ్జనబృంద సంగతికిఁ గ్రేవ కమలనాభా శ్రయానందకర ప్రభావ
మోక్షకల్ప ద్రుమంబెక్క మొదటితీవ భువనరక్షా ప్రభావ భాగవతసేవ.

గంధం నరసింహాచార్యులు.